"హేయ్! వేర్‌ఆర్యు ఫ్రమ్?' పోస్టాఫీసు క్యూలో నిలబడిన నేను ఆ సన్నగా, చిన్నగా వినిపించిన మాటలకు వెనుదిరిగి చూశాను. 'ఆమె' వేషధారణ ఇంగ్లీషువారినే అనుకరించినా రూపు రేఖలనుబట్టి భారత నారీమణి కాబోలుననుకున్నాను.

# తెలుగంటే చేదా?




"ఐయామ్ ఫ్రమ్ ఇండియా" అని సమాధాన మిచ్చాను. "వుచ్ పార్టాఫ్ ఇండియా" అడిగిందామె. "ఆంధ్ర ప్రదేశ్" అన్నాను, మెల్లిగా నవ్వుతూ. "ఓ! ఐసీ! అయామ్ ఆల్సో ఫ్రమ్ ఆంధ్రా" అందామె ప్రతిగా నవ్వుతూ. ఆమె అలా అనగానే నా మనసు ఆనందంతో నిండిపోయింది. అందుకే అంటారు కాబోలు "తేలికగా దొరికేవాటికి విలువ తక్కువ" అని. ఇక్కడ ఇండియన్స్ ఎంతమంది వున్నా తెలుగువాళ్ళనేసరికి అదేదో ఆత్మీయతలాంటి భావం చిగురిస్తుంది మనసులో.

క్యూ అయిపోయి నావంతు వచ్చేసరికి ఓ అరడజను ఏరోగ్రామ్స్ కొనుక్కుని బయటపడ్డాను. 'ఆమె' వచ్చేవరకూ వేచి చూస్తూ ప్రక్కగా నిల్చున్నాను. 'ఆమె' వచ్చీరాగానే "హో వేర్ డు యు లివ్?" అడిగింది. "సెయింట్ మేరీస్ హాస్పిటల్" చెప్పాను. తర్వాత మరికొంత సంభాషణ అలాగే సాగింది.

ఎంతకూ తెలుగులో మాట్లాడదేంటీమె? అనుకుని నేనే అడిగాను "మీ పేరు తెలుసుకోవచ్చా?" అని "ష్యూర్ మై నేమ్ ఈజ్ ఆన్నే" అంది. ఆ పేరు వినగానే అదిరిపోయి అసలీమె 'తెలుగామె'యేనా అని బోలెడంత అనుమానం వచ్చి "ఆర్ యు ఫ్రమ్ ఆంధ్రా" అడిగాను. "యస్" అంది. "కెన్ యు స్పీక్ తెలుగు" అడిగాను విస్మయంగా. "యస్ ఐ కెన్"

మాచర్ల హేమ

అంది. "హమ్మయ్య" అని తేలికగా శ్వాస విడిచి "మరి మీ పేరు ఇంగ్లీషు పేరులా వుంటే అనుమానమొచ్చి అడిగాను" అన్నాను. "ఐ హేట్ మై నేమ్ బికాజ్ యునో 'అన్నపూర్ణ' ఈజె ఓల్డెస్ట్ నేమ్" అంది. మళ్ళీ తనే "మే ఐ నో యువర్ నేమ్ ప్లీజ్" అడిగింది. ఈమెకు తెలుగొచ్చు అంటుంది, తెలుగులో మాట్లాడితే అర్థమైపోతుంది. మరెందుకు 'తెలుగు'లో మాట్లాడటం లేదు? నేను కావాలనే "నా పేరు హేమ" అని తెలుగులో చెప్పాను

ఇంతలో మా ఇల్లు రావడంతో ఆమెను లోనికాహ్వానించాను. తనకేదో పనుంది అనుకుంటూనే లోపలికొచ్చి కూర్చుంది. ఏవో మాటలు (అన్నపూర్ణ ఇంగ్లీషులో, నేను తెలుగులో) చెప్పుకుంటుండగా మా పిల్లలొచ్చారు. వాళ్ళకత్యంత ప్రియమైన 'ఆంటీ' ఇంటి నుంచి.

ఇక్కడ ఆ 'ఆంటీ' గురించి కొంత చెప్పాలనిపిస్తుంది. "నుదుట ఎర్రని కుంకుమ బొట్టు, నిండైన చీర కట్టు"తో కళకళలాడుతూ "తెలుగుదనం" ఉట్టిపడుతూ, స్వచ్ఛమైన తెలుగులో (ఇంగ్లీషులో ధారాళంగా మాట్లాడగల్గినా) ఆదరంగా చెరగని చిరునవ్వుతో పలకరించే ఆమెను చూస్తే ఏ తెలుగు వారికైనా, వయసుమళ్ళిన వాళ్ళకైనాసరే "అమ్మా!" అని పిలవాలనే అనుభూతి కల్గక మానదు. ఇంగ్లండ్‌లోనే చదువుకుంటున్న వారి పిల్లలు కూడా చక్కని తెలుగులో మాట్లాడగలరు

మా వంశీ, స్మితలకు అన్నపూర్ణను పరిచయం చేస్తూ వీళ్ళూ "తెలుగువాళ్ళే" అన్నాను. పిల్లలను అన్నపూర్ణతో మాట్లాడుతుండమని చెప్పి, తన పేరు అన్నపూర్ణ అని పిల్లలతో చెప్పినందుకు ఆమెకొచ్చిన కోపానికి మనసులోనే నవ్వుకొంటూ కిచెన్‌లో టీ చేస్తున్న నాకు మా వంశీ మాటలు విన్పించినయి. "మీరూ టెలుగ్ వళ్ళాయితే మారి ఏంద్ కూ టెలుగ్‌లో మాటాడ్ రూ?" అని. నా మనసులోని మాట వాడడిగినందుకు నాకెందుకో బరువు దిగదించుకున్నట్లుగా అన్పించింది.

టీ అందిస్తున్న నాతో అంది' అన్నపూర్ణ సారీ! ఆన్ "మీ పిల్లలకు ఇంగ్లీష్ రాదా? మా పిల్లలయితే తెలుగు పూర్తిగా మర్చిపోయారు తెల్సా!" అని గర్వంగా అంది. ఆమె తెలుగు భాషా తృణీకరణ నాకు కొంత బాధగా అన్పించినా "మా

పిల్లలు ఇంట్లో తెలుగే మాట్లాడ్తారండీ" అన్నాను ఎంత నాగరికత తెలియని దాని వన్నట్లు నావేపోసారి చూసి వెళ్ళడానికి లేచింది. "మీకు తెలుగు పుస్తకాలేమయినా కావాలా?" 'కనీసం పుస్తకాలయినా చదువుతుందా లేదా అనే కుతూహలం'తో అడిగాను. "నో థ్యాంక్స్ ఐ హేట్ తెలుగూ అండ్ ఐడోంట్ లైక్ తెలుగూ బుక్స్"అంటూ తన బ్యాగ్‌లోంచి "అన్నా కెరినీనా" ఇంగ్లీషులో వున్న నవల తీసి గొప్పగాచూపించింది."ఐ హేట్ తెలుగు" అన్నఆమె మాటలతో నా మనసు చివుక్కు మంది. పదేపదే ఆ మాటే నా చెవులలో ప్రతిధ్వనించడంతో తగిన సమాధానం చెప్పాలని మనసులో ఎంత వున్నా ఒక్క మాటా పెదవిదాటి రాలేకపోయింది. నాలోని ఆ బలహీనతే ఎప్పుడూ నన్ను నేను తిట్టుకునేలా చేస్తుంది.

ఆ తర్వాత వారం రోజుల కనుకుంటా అన్నపూర్ణ ఫోన్‌చేసి వాళ్ళింటికి రమ్మంటే వెళ్ళాను. అక్కడ మరొక తెలుగు అమ్మాయి కిరణ్మయిని కిర్నా అని పరిచయం చేస్తూ (పేరును చూసి కాదుగాని) ఆశ్చర్యపోయి కళ్ళప్పగించి చూడడం తప్ప మరేం చెయ్యలేకపోయాను. కారణం! ఆయనే కన్నా అదనంగా బుగ్గలకు ఎరుపు రంగూ కళ్ళకు 'ఐషాడో'. కనురెప్పలకు మస్కారా. మినీ స్కర్ట్. స్లీవ్‌లెస్ బ్లౌజుతో దర్శన మిచ్చిన ఆమె రూపం చీర కట్టుకోకపోయినా. జుట్టు కత్తిరించుకున్నా. వేసుకునే బట్టలేవో ఒంటినిండా వేసుకోకపోవడం. చిన్న చుక్కయినా బొట్టులా పెట్టుకోకపోవడం. నాకెందుకో అదోలాగ అన్పించింది.

ఓ గంటసేపుసాగిన ఇంగ్లీష్ సంభాషణతో విసుగొచ్చి తెలుగులో సంభాషణ ప్రారంభించిన నన్ను ఈసడించినటుగా చూసి నన్ను వాళ్ళ సంభాషణ నుంచి తొలగించి వాళ్ళదరే ప్రవాహంలా ఇంగ్లీష్‌లో మాట్లాడుకోసాగారు

వాళ్ళ మాటల్లో దొర్లిన "కంట్రీ బ్రూట్స్. మానర్‌లెస్ ఫెలోస్ అన్ కల్చర్డ్ క్రీచర్స్" లాంటి మాటలు నాలాంటి తెలుగువారికి బిరుదులనీ డర్టీ లాంగ్వేజ్, పన్నీవర్డ్స్ న్యూసెన్స్ అనే మాటలు తేనెలాంటి తెలుగు భాషకు గౌరవాలనీ తెలియడాని కెంతోసేపు పట్టలేదు నాకు.

ఎందుకోగాని కొంతమంది తెలుగు వాళ్ళు విదేశాలకు వెళ్ళినా.వెళ్ళకపోయినా ఇంగ్లీష్‌లో మాట్లాడితేనే గొప్ప అనుకుంటారు. పాపం తెలిసీ తెలియని చిన్న పిల్లలు తెలుగులో మాట్లాడితే వాళ్ళను కొట్టి, తిట్టి తెలుగులో మాట్లాడకుండా నిర్బంధిస్తారు

ఇంగ్లీషు నేర్చుకోవద్దనీ. మాట్లాడొద్దనీ నిషేధించమని కాదు. విదేశీయుల్లా వేష భాషలు నేర్చుకున్నంత మాత్రాన వాళ్ళలోని సంస్కార పరిమళం అబ్బదే!చాలా మంది విదేశీయుల్లోని మంచిని వదిలిపెట్టి చెడువైపే ఎందుకు పరుగులుతీస్తున్నారు! ఇంగ్లీష్‌వాళ్ళు ముగురు వ్యక్తులు కలిసినప్పుడు మూడో వ్యక్తిని యిలా నిర్లక్ష్యంగా వదిలేసి ఏ ఇద్దరూ సంభాషణ సాగించరు ఆ మూడో వ్యక్తి ఎవరైనా ఇంగ్లీష్ మాట్లాడలేకపోయినా సైగలతోనయినా అతి చాకచక్యంగా సంభాషణలోకి దింపుతారు. ఏ దేశంలో నయినా మంచీ. చెడూ రెండూ వుంటూనే వుంటాయి. మాటల్లోనేగదా మనిషి సంస్కారం బయటపడేది.

ఏ ప్రాంతీయులైనా తమ తమ భాషలంటే మక్కువ చూపించి గౌరవిస్తారు. విదేశీయులయినా తమ భాష గౌరవం చెరిపేసుకోరు. జర్మన్‌వారు జర్మన్ తప్ప. ఫ్రెంచ్‌వారు ఫ్రెంచ్ తప్ప. ఇంగ్లీషు వచ్చినా చస్తే మాట్లాడరు. మరీ అలా ఉండకపోయినా కనీసం తెలుగువాళ్ళలో తెలుగు వాళ్ళయినా, కనీసం ఇంట్లో నయినా తెలుగు మాట్లాడితే నష్టమేమిటి? తెలుగు భాష అంత మహాపరాధం ఏం చేసుకుంది?

శ్రీకృష్ణదేవరాయలంతటివాడు "దేశ భాషలలందు తెలుగు లెస్స" అని గౌరవించాడే.

ఓ మహాకవి "మా తెలుగు తల్లికి మల్లెపూదండ" అంటూ కవితాగానం చేశాడే. మరో మహాకవి "తీయ తేనియ కన్న తెలుగు మిన్న" అన్నాడే. అంతెందుకు విదేశీయులంతా మీ తెలుగు భాష చక్కని సంగీతంలా శ్రావ్యంగా మళ్ళీ మళ్ళీ వినాలన్పిస్తుందని మెచ్చుకుంటారే! మరి వాళ్ళందరికన్నా గొప్పవాళ్ళా ఈ అన్నపూర్ణ, కిరణ్మయిలు. 'తీయ తేనియ' లాంటి 'తేట తెలుగంటే చేదా' వీళ్ళకు. "వాటార్య థింకింగ్" కిరణ్మయి మాటలతో సుళ్ళు తిరుగుతున్న ఆలోచనల్లోంచి బయటపడి ఒక్కక్షణం ఆమె ఏం అడిగిందో అర్థంగాక చూస్తున్న నా నోటి నుంచి అప్రయత్నంగా 'తెలుగంటే చేదా' అనే మాటలు వెలువడ్డాయి.



## నీకూ — నాకు

ఊరవతల రోడ్ మీద కారాగిపోతే. బోనెట్ ఎత్తి బాగు చేస్తున్న సుబ్బారావుకు కారువెనుక ఏదో చప్పుడు వినిపించి అటు చూశాడు. ఎవరో వ్యక్తి ఏమిటో విప్పుతూ కన్పించాడు.

"ఏయ్- ఏమిటిది" సుబ్బారావ్ అడిగేడు.

"నువ్– బాటరీ తీసుకో. నేను ఇది తీసుకొంటాను"

—ఎ. వి. రామారావు, గుళ్ళదీవి

